నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ శనివారం 28 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

పింఛన్ పెంచాలని వృద్ధుల నిరసన

నిరసన తెలుపుతున్న పింఛన్‌దారులు

ఇచ్చోడ, సెప్టెంబర్ 27 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వృద్ధాప్య పింఛన్ పెంచాలని కోరుతూ శుక్రవారం మండలంలోని ముక్రా(బీ) గ్రామంల్లో పోస్టాఫీస్ ఎదుట పింఛన్‌దారులు నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనకు మాజీ సర్పంచ్ మారుతి మద్దతు తెలిపారు. అధికారంలోకి వస్తే వృద్ధాప్య పింఛన్ రూ.2 వేల నుంచి రూ.4 వేలకు, దివ్యాంగులకు రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పింఛన్‌దారులు దత్తురాం, నరేందర్, గంగారాం, లక్ష్మీబాయి, రుక్మాబాయి, కౌసల్యాబాయి పాల్గొన్నారు.

జోనల్ స్థాయి గిరిజన క్రీడలు ప్రారంభం

జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, సెప్టెంబర్ 27 : స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలోని క్రీడా మైదానంలో జోనల్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఐ టీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ప్రారంభించారు. జాతీయస్థాయిలో పతకాలు సాధించిన గిరిజన క్రీడాకారులు మైదానంలో పరుగులు తీస్తూ క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. క్రీడలకు రాష్ట్ర ప్రాధాన్యమిస్తున్నదని తెలిపారు. గిరిజన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించడం శుభపరిణామన్నారు. అదనపు కలెక్టర్ అజ్మీరా సాంకేత్, ఏపీవో వసంత్‌రావు, నాయకులు ఎస్పీ రెడ్డి, రమేశ్, ఏటీడీవోలు క్రాంతి అమిత్, నిహారిక, ప్రకాశ్, భాస్కర్, ప్రేమ్‌దాస్, కృష్ణారావు, ఉత్తందాస్, జగన్, శివాజీ, హేమంత్‌రావు, శ్రీనివాస్, రవీందర్, విశ్వనాథ్, జైవంత్‌రావు, లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు

అడ్డగోలుగా కడుపు 'కోత'లు

- పెరుగుతున్న సిజేరియన్లు
- ప్రైవేట్ దవాఖానల్లో యథేచ్ఛగా ఆపరేషన్లు
- అవసరం లేకున్నా భయపెడుతున్న మాఫియా
- వైద్యుల నిర్లక్ష్యంతో ఇటీవల బాలింత మృతి
- పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారులు

ఇటీవల నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో వైద్యం వికటించి బాలింత మృతి చెందడంతో రోడ్డుపై ఆందోళన చేస్తున్న బంధువులు (ఫైల్)

నిర్మల్, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ) : ప్రైవేట్ దవాఖానలో యథేచ్ఛగా కడుపు కోతలకు తెగబడుతున్నాయన్న విమర్శలున్నాయి. మాఫియగా మారి అవసరం లేకున్నా బాధితులను భయపెట్టి అందినకాడికి దండుకుంటున్నారు. దీంతో ఆరోగ్యంతోపాటు, డబ్బులను కూడా నష్టపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 107 ప్రైవేట్ దవాఖానలు ఉండగా, దాదాపు 40 హాస్పిటళ్లలో కాన్పులు చేస్తున్నారు. ఆయా దవాఖానల్లో అత్యధికంగా సిజేరియన్లే చేస్తున్నట్లు సమాచారం. ఆయా దవాఖానల్లో ఎప్పుడో ఒకసారి నార్మల్ డెలివరీ చేస్తూ.. మిగతా రోజుల్లో సిజేరియన్లకే ప్రాధాన్యతనిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రైవేట్ దవాఖానల్లో ఈ ఏడాది సెప్టెంబర్ 20వ తేదీ వరకు 2,196 కాన్పులు జరుగగా, ఇందులో సాధారణ ప్రసవాలు 199 మాత్రమే ఉన్నాయి. మిగతా 1,997 ప్రసవాలు సిజేరియన్ ద్వారానే జరిగాయి. సాధారణ ప్రసవాలు చేయాలని అధికారులు ఎన్నిసార్లు ఆదేశాలు జారీ చేస్తున్నా..దవాఖానల నిర్వాహకులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఇటీవల నిర్మల్‌లోని డాక్టర్స్ లేన్‌లో గల ఓ దవాఖానలో సిజేరియన్ ద్వారా కాన్పు చేయించుకున్న మహిళకు తీవ్ర రక్తస్రావమై మరణించింది. ఆమె మరణానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. సిజేరియన్ల సంఖ్యను తగ్గించడంతో మరణాలను అరికట్టవచ్చని గత కేసీఆర్ ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చి ప్రభుత్వ దవాఖానల్లో సకల సదుపాయాలను కల్పించింది. అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, కేసీఆర్ కిట్‌లను అందజేసి సిజేరియన్లకు అడ్డుకట్ట వేసింది. కాగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యరంగాన్ని ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ మాఫియా మళ్లీ అడ్డగోలుగా కడుపు కోతలకు తెగబడుతుందన్న విమర్శలు ఉన్నాయి.

భయపెట్టి.. బలవంతంగా..

గతంలో నార్మల్ డెలివరీలే అధికంగా జరిగేవి. రానురాను పరిస్థితి దారుణంగా తయారైంది. ధనార్జనే ధ్యేయంగా డాక్టర్లు కాని వారు కూడా వైద్య వృత్తిని వ్యాపారంగా మార్చేశారు. ప్రధాన పట్టణాల్లో కొంతమంది కోట్లాది రూపాయలను ఖర్చుచేసి మల్టీ స్పెషాలిటీ హాస్పిటళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన డాక్టర్లను నియమించుకుని లక్షల రూపాయల జీతాలను చెల్లిస్తున్నారు. అధిక లాభాల కోసం ఆసుపత్రుల నిర్వాహకులు డాక్టర్లకు టార్గెట్లు పెడుతున్నారు. ఇందులో భాగంగానే సాధారణ ప్రసవానికి అవకాశాలు ఉన్నప్పటికీ, బాధితులను భయభ్రాంతులకు గురిచేసి సిజేరియన్ చేసుకునేందుకు ఒప్పిస్తున్నారు.

ఆరోగ్యంపై ప్రభావం

ప్రైవేట్ దవాఖానల్లో ఎక్కువగా సిజేరియన్లు చేస్తుండడంతో తల్లి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. సిజేరియన్ అంటే కచ్చితంగా కడుపుపై కోత పెట్టాల్సిందే. దీంతో అది మాని, సాధారణ స్థితికి రావడానికి కనీసం నెల నుంచి రెండు నెలల సమయం పడుతుంది. మందులు కూడా వాడాల్సి ఉంటుంది. వీటి ప్రభావం పుట్టిన శిశువుపై కూడా పడుతున్నది. తప్పనిసరిగా అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణ ప్రసవాలతో పోలిస్తే సిజేరియన్లకు మూడింతలు వసూలు చేస్తారు. సాధారణ ప్రసవానికి రూ.10 వేల నుంచి రూ.15 వేలు వసూలు చేస్తుండగా, సిజేరియన్ ద్వారా కాన్పు చేస్తే రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు దండుకుంటున్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో పర్వాలేదు..

ప్రైవేటు హాస్పిటళ్లలో పరిస్థితి దారుణంగా ఉండగా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొంత వరకు పర్వాలేదంటున్నారు. ప్రైవేట్‌తో పోలిస్తే ఇక్కడ సాధారణ ప్రసవాల సంఖ్య కొంత మెరుగ్గా ఉన్నది. నిర్మల్‌లో ప్రత్యేకంగా ప్రసూతి దవాఖాన కొనసాగుతుండగా, ఖానాపూర్, భైంసా పట్టణాల్లో ఏరియా దవాఖానల్లో ప్రసూతి విభాగాన్ని నిర్వహిస్తున్నారు. కాగా.. ఆయా హాస్పిటళ్లలో జరిగిన ప్రసవాల సంఖ్యను పరిశీలిస్తే.. ఈ ఏడాది 2,217 కాన్పులు కాగా, ఇందులో సాధారణ ప్రసవాలు 805 ఉన్నాయి. ఇక సిజేరియన్లు 1,412 ఉన్నాయి. అంటే ఇక్కడ ప్రతి పదిలో ఆరు సిజేరియన్లు జరుగుతుండగా, నాలుగు నార్మల్ డెలివరీలు జరుగుతున్నాయి. 2023 సంవత్సరంలో 5,742 కాన్పులు కాగా, ఇందులో సాధారణ ప్రసవాలు 1,999 ఉన్నాయి. సిజేరియన్లు 3,743 జరిగాయి. కేసీఆర్ ప్రభుత్వం సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని కఠిన ఆదేశాలివ్వడంతోనే ప్రభుత్వ దవాఖానల్లో పరిస్థితి మెరుగ్గా ఉందంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ దవాఖానల్లో 35-36 శాతం వరకు సాధారణ కాన్పులు జరుగుతుండగా, ప్రైవేట్‌లో మాత్రం 10 శాతానికి మించడం లేదు. దీనికి అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రెగ్యులర్‌గా మానిటరింగ్ చేస్తాం..

ప్రైవేట్ హాస్పిటళ్ల నిర్వాహకులతో రెగ్యులర్‌గా సమావేశాలు నిర్వహించి ప్రసవాలపై రివ్యూ నిర్వహిస్తాం. ఏ ఆసుపత్రుల్లో సిజేరియన్లు ఎక్కువగా జరుగుతున్నాయో వాటిని గుర్తించి విచారణ నిర్వహిస్తాం. విచారణలో తప్పని తేలితే చర్యలు తీసుకుంటాం. నిబంధనలు పాటించని ఆసుపత్రులను సీజ్ చేసేందుకు వెనుకాడం. ప్రభుత్వ దవాఖానలో సాధారణ ప్రసవాలకే ప్రయత్నించాలని వైద్యులకు, సిబ్బందికి ఆదేశాలిచ్చాం.

- డాక్టర్ రాజేందర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, నిర్మల్.

ఆందోళన చేస్తున్న ఖానాపూర్ వాసులు

ఇండ్ల ఫొటోలు తీస్తున్న సర్వే అధికారులు

మా ఇండ్లు కూల్చద్దు సారూ..

- కూలీ చేసుకునే గరీబోళ్లం ● పైసా, పైసా కూడబెట్టి కట్టుకున్నాం ● అధికారులను వేడుకున్న ఖానాపూర్ చెరువు పరిసరాల్లోని పేదలు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : 'కూలీ పను లు చేసుకునే గరీబోళ్లం. 30 సంవత్సరాలకుపైగా మా తాతల కాలం నుంచి ఇండ్లు కట్టుకుని నివాసం ఉంటున్నాం. కూలీ పనులు చేసుకుంటూ పైసా, పైసా కూడబెట్టుకుని ఇండ్లు కట్టుకున్నాం. అధికారులు మా ఇండ్లను కూల్చి మమ్మల్ని రోడ్డుపాలు చేయవద్దు' అంటూ ఖానాపూర్ చెరువు పరిసర ప్రాంతాల వాసుల అధికారులను వేడుకున్నారు. శుక్రవారం రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు నాలుగు బృందాలుగా ఖానాపూర్ చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతాన్ని గుర్తించి హద్దులను మార్కింగ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న కాలనీవాసులు అధికారులను అడ్డుకున్నారు. ఎందుకు కొలతలు తీస్తున్నారంటూ ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో అందరూ పేదలున్నారని కూలీ పనులు చేయనిది పొట్టగడవని పరిస్థితి ఉందని వారు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటున్న తమ ఇండ్లను ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు మార్కింగ్ చేస్తుందని, గృహాలు కూల్చే ప్రయత్నాలను మానుకోవాలని కోరారు. ఇండ్లు కూల్చివేతపై వస్తున్న సమాచారం మేరకు వారం రోజులుగా తాము ఆందోళన చెందుతున్నామని, తిండి తినకపోవడంతో పాటు నిద్రకూడా రావడం లేదని ఆదేదన వ్యక్తం చేశారు. రెక్కల కష్టంపై బతుకుతున్న తమను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేధించవద్దని కోరారు.

ఇల్లు కూల్చవద్దంటూ రోదిస్తున్న మహిళలు

అన్ని పర్మిషన్లు తీసుకునే కట్టుకున్నాం..

తమ ఇండ్లకు అన్ని అనుమతులు ఉన్నాయని కాలనీవాసులు తెలిపారు. ఇండ్ల నిర్మాణాలు మున్సిపాలిటీ అధికారులు అనుమతులు ఇచ్చారని, మున్సిపల్ ట్యాక్స్ కూడా కడుతున్నామని తెలిపారు. రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు సైతం ఉన్నాయన్నారు. కాలనీలో రోడ్లు, మురుగుకాల్వలు, ఇతర సదుపాయాలను ప్రభుత్వం కల్పించిందని పాఠశాల సైతం నిర్మించారని తెలిపారు. ప్రభుత్వం కూల్చివేత ప్రయత్నాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం ఇండ్ల కూల్చివేత ప్రయత్నాలను మానుకోవాలని కోరారు.

ఏమీ చెప్పకుండా మార్కింగ్ చేస్తున్నారు

నేను ఆటో నడుపుకుంటూ బతుకుతున్న. మా తాతల కాలం నాడు నిర్మించిన ఇంట్లో నివాసం ఉంటున్న. మున్సిపాలిటీ అధికారులు వచ్చి ఏమీ చెప్పకుండా ఇంటికి నంబర్ వేశారు. ఇంట్లో ఎవరూ లేనప్పుడు మార్కింగ్ చేశారు. ఎందుకు ఇలా చేశారని అడిగితే సమాధానం చెప్పడం లేదు. మా కాలనీలో నివసించే వారందరూ గరిబోళ్లు. పనిచేసుకుంటే గానీ కడుపు నిండని పరిస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను ఇబ్బందులు పెట్టవద్దు. ఇండ్లు కూల్చివేస్తే వారి గతి ఏమీ కావాలి. సర్కారు పేదల ఇండ్ల జోలికి రావద్దు.

- అశ్వక్, ఆటో డ్రైవర్, ఖానాపూర్, ఆదిలాబాద్

రూ. 3 లక్షల అప్పుచేసి ఇల్లు కట్టిన..

20 సంవత్సరాలుగా ఇక్కడ గుడిసెలో నివాసం ఉంటున్నాం. గతేడాది రూ.3 లక్షలు అప్పుచేసి రేకుల షెడ్ నిర్మించుకున్నాం. నాకు దివ్యాంగుడైన కొడుకు ఉన్నాడు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న. ఇంటి నిర్మాణానికి తీసుకున్న అప్పుకు ప్రతి నెలా వడ్డీ కడుతున్నాను. ఇప్పుడు అధికారులు వచ్చి నంబర్లు వేస్తున్నారు. ఇల్లు కూల్చివేస్తే మా పరిస్థితి రోడ్డున పడుతది. చెరువు నీళ్లు మా ఇంటి పరిసరాల్లోకి కూడా రావు. ఇల్లు పోతుందని భయంతో తిండి కూడా తినడం లేదు. నిద్రకూడా రావడం లేదు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉన్నా. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను గోస పుచ్చుకుంటున్నది.

- పిట్ల అశోక్, ఖానాపూర్

ఆదిలాబాద్‌లో కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

బోథ్‌లో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

నివాళులర్పిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు

కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటం స్ఫూర్తిదాయకం

జయంతి వేడుకల్లో ఆదిలాబాద్ , నిర్మల్ కలెక్టర్లు

ఎదులాపురం, సెప్టెంబర్ 27: తెలంగాణ రాష్ట్ర సాధన తొలి, మలి దశ ఉద్యమాల్లో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచారని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. కొండా లక్ష్మణ్ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఆయన కృషిని గుర్తించి హ్యాండ్ లూం టెక్నాలజీ సంస్థలకు ఆయన పేరు పెట్టి ప్రభుత్వం గౌరవించిందన్నారు. కొత్త కలెక్టరేట్‌కు కొండా లక్ష్మణ్ పేరును పెట్టాలని పద్మశాలీ సంఘం అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ విన్నవించగా మంత్రి సీతక్కతో దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి. బీసీ వెల్ఫేర్ అధికారి కే రాజలింగు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు లక్ష్మణ్ బాపూజీ

బోథ్, సెప్టెంబర్ 27 : నిజాం సర్కార్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, తెలంగాణ సాధనకు పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం బోథ్‌లో బాపూజీ విగ్రహన్ని ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో కలిసి ఆవిష్కరించారు. తెలంగాణ కోసం రాజీనామా చేసిన మొదటి వ్యక్తి, విలువలతో కూడి నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షులు మంచికట్ల ఆశమ్మ, మండల శాఖ అధ్యక్షుడు అసాల సదాశివ్, పట్టణ శాఖ అధ్యక్షుడు మెరుగు భోజన్న, ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, సురేందర్ యాదవ్, తాహెర్ బిన్ సలాం, బలరాం, జీవీ రమణ, కే.విశ్వనాథ్, శ్రీధర్ రెడ్డి, రుక్మన్ సింగ్, బొడ్డు శ్రీనివాస్, బిట్లింగ్ నర్సయ్య, జీ.రాజు యాదవ్, బసుల చంటి, అబుద్ పాల్గొన్నారు.

జిల్లా వాసి కావడం గర్వకారణం

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 27 : భారత స్వాతంత్ర్య, తెలంగాణ సాధన ఉద్యమాల్లో పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి కావడం గర్వకారణమని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, డీపీవో శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్, పరిశ్రమల శాఖ మేనేజర్ నరసింహరెడ్డి, తదితరులున్నారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు పద్మశాలీ కులస్తులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.

అర్హత లేని వైద్యురాలు.. అనుమతి లేని దవాఖాన

ఖానాపూర్‌లోని ప్రైవేట్ దవాఖాన ఎదుట రోగి బంధువుల ఆందోళన

దవాఖాన ఎదుట ఆందోళన చేస్తున్న రోగి బంధువులు

ఖానాపూర్ టౌన్, సెప్టెంబర్ 27 : సరైన వైద్యం అందించకుండా అధిక బిల్లులు వేశారని, అర్హత లేని వైద్యురాలితో చికిత్స అందిస్తున్నారని, అనుమతి లేకుండా దవాఖానను నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని తిరుమల పిల్లల, జనరల్ దవాఖాన ఎదుట శుక్రవారం రోగి బంధువులు ఆందోళన చేశారు. రోగి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ పట్టణానికి చెందిన పాదం మల్లవ్వకు అనారోగ్యంతో తిరుమల పిల్లల, జనరల్ దవాఖానకు వచ్చింది. రెండు గంటల పాటు చికిత్స అందించి రూ.3450 వేల బిల్లు తెల్లకాగితంపై వేసి ఇచ్చారు. సరైన వైద్యం అందించకుండానే బిల్లు వసూలు చేయడంపై రోగి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ దవాఖాన ఎదుట ఆందోళన చేశారు. వీరికి పలువురు పట్టణ వాసులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా దవాఖాన నిర్వహిస్తున్నారని, డాక్టర్ సౌజన్యకు ఎంబీబీఎస్ పట్టా లేకుండా వైద్యం అందించడంపై యాజమాన్యాన్ని నిలదీశారు. ఈ విషయమై దవాఖాన యాజమాన్యాన్ని వివరణ కోరగా మహిళ వైద్యురాలు ఇటీవలే ఎంబీబీఎస్ పరీక్ష రాసిందని ఇంకా ఫలితాలు రావాల్సి ఉందని తెలిపారు. క్వాలీఫైడ్ డాక్టర్ లేకపోవడంతోనే దవాఖానకు అనుమతి తీసుకోలేదని తెలపడం గమనార్హం.

జరిమానా విధిస్తాం..

డీఎంహెచ్‌వో రాజేందర్

తిరుమల పిల్లల, జనరల్ దవాఖానను నిర్మల్ డీఎంహెచ్‌వో రాజేందర్ తనిఖీ చేశారు. దవాఖానకు అనుమతి లేదని, ఎంబీబీఎస్ ఉత్తీర్ణత లేకుండా సౌజన్య చికిత్స అందించినట్లు గుర్తించారు. మరో వైద్యుడు దినేశ్‌కుమార్ ఎంబీబీఎస్‌లో ఉండే చికిత్స మాత్రమే అందించాలని, పిడియాట్రిక్ చికిత్స చేయవద్దన్నారు. సౌజన్య చికిత్స అందించవద్దని ఆదేశించారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్నందుకు యాజమాన్యానికి జరిమానా విధిస్తామన్నారు.

కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు



మాట్లాడుతున్న వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ వీ శ్రీనివాస్

ఎదులాపురం,సెప్టెంబర్ 27 : పత్తి మార్కెట్‌కు ఆదిలాబాద్ ఆసియాలో పేరు గాంచిందని, సీజన్ ప్రారంభం కంటే ముందు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని మార్కెటింగ్ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ వీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని మార్కెటింగ్ ఏడీ కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కాటన్ సీజన్ ప్రారంభంపై అధికారులకు సూచనలు చేశారు. ప్రారంభం నాటికి అన్ని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పత్తి సీజన్ త్వరలోనే ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యవసాయ మార్కెట్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీజన్ ప్రారంభ సమయంలో అన్ని కాంటలు, తేమ పరికరాలు సన్నద్ధం చేసుకోవాలని సూచించామన్నారు. అదే విధంగా జిన్నింగ్ మిల్లులు కూడా సిద్ధమయ్యేలా చూడాలన్నారు. ఎక్కడ కూడా రైతులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్ కార్యదర్శులు అశ్వక్. శ్రీనివాస్, శభుదొద్దీన్, గజానంద్ పాల్గొన్నారు.

పోషకాహారం లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

- పోషణ్ మాహ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

మాట్లాడుతున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

ఎదులాపురం, సెప్టెంబర్ 27 : పోషకాహారంపై విస్తృతంగా అవగాహన కల్పించి, పోషకాహార లోపం లేని జిల్లాగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద సూచించారు. పోషణ్ మాహ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టీటీడీసీలో పోషకాహారం ఆవశ్యకతపై నిర్వహించిన సదస్సుకు కలెక్టర్ రాజర్షి షాతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోషక విలువలతో ఆహార పదార్థాలపై ప్రదర్శన స్టాళ్లను ఆమె ప్రారంభించారు. అనంతరం సమావేశంలో ఆమె మాట్లాడుతూ పూర్వీకులు కూర, పప్పు, ఆకు కూరలు తిని ఆరోగ్యంగా ఉండేవారని తెలిపారు. ప్రస్తుతం పౌష్టికాహార లోపంతో రక్తహీనత, ఇతర వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. మహిళలు, బాలికల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. పోషకాహారం లోపాన్ని నివారించేందుకే పోషణ మాహ్ కార్యక్రమాన్ని తీసుకువచ్చామన్నారు. దీన్ని అంగన్‌వాడీ ఉద్యోగులు విజయవంతం చేయాలన్నారు. బాలికలు, మహిళల అనారోగ్య సమస్యలు, 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్' తదితర వాటిపై అవగాహన కల్పించాలని కోరారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకునేలా చూసి రక్తహీనత బారిన పడకుండా చూడాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా కమిషన్ టోల్ ఫ్రీ నెంబర్ 94905 55533ను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ప్రజలు ప్యాకెజీ ఫుడ్‌కు ఎక్కువగా అలవాటు పడుతున్నారని, అందులో సోడియం ఎక్కువగా ఉండడంలో వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ఏ పోషకాలు ఏ ఆహారంలో లభిస్తాయో పోషణ మాహ్ కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ ఉద్యోగులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, జడ్పీ డిప్యూటీ సీఈవో కలిందిని, డీడబ్ల్యూవో బీ.సబిత, ఏసీడీపీవో మిల్కా, రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, మెప్మా పీడీ మమత, సుభ్రత, విజయలక్ష్మి, కమల, కాంగ్రెస్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణక్క, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంజు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు గిమ్మ, సంతోష్, రూపేశ్ రెడ్డి పాల్గొన్నారు.

నాగోబా ఆలయంలో పూజలు

ఇంద్రవెల్లి, సెప్టెంబర్27 : ఇంద్రవెల్లి మండలంలోని కెస్లాపూర్ నాగోబా ఆలయాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలకు చేరుకొని పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్లు 181, 1098కు ఫోన్ చేసి తెలుపాలని విద్యార్థినులకు సూచించారు. పలు సమస్యలను విద్యార్థినులు విన్నవించగా పరిష్కరిస్తామని తెలిపారు. నాగోబా ఆలయాన్ని సందర్శించిన తర్వాతే తాను రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు, తనిఖీలు ప్రారంభించినట్లు తెలిపారు. ఆమె వెంట రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్రం ఈశ్వరీబాయి, మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ పటేల్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, ఎస్ఐ దుబ్బాక సునీల్, కెస్లాపూర్ మాజీ సర్పంచ్ రేణుకానాగ్‌నాథ్, నాగోబా ఆలయ పూజారి మెస్రం షేకు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.